సాక్షి
కర్నూలు

గురువారం । 7 । ఆగస్టు । 2025

మీ ఆప్యాయతే శ్రీరామరక్ష



వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌కు రాఖీ కడుతున్న ఎస్సీ విజయ మనోహరి



రాఖీ కట్టి పుష్పాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి



రాఖీ కడుతున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

న్యూస్‌రీల్

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులతో వై. ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: తెలుగుదేశం పార్టీ నుంచి ముచ్చగిరి గ్రామానికి చెందిన నాయకులు బుధవారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మిగనూరులోని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి స్వగృహంలో వీరిని పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి ఆహ్వానించారు. ముచ్చగిరి సర్పంచ్ హనుంతు, నాయకులు సురేష్‌గౌడ్, మాజీ డీలర్ నాగప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బోయ తాయప్ప, బోయ శివారెడ్డి, బోయ గోవిందు, రంగస్వామి, నాగరాజు, రామాంజి, గురురాజు, రంగస్వామితో పాటు మరో 20 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేసి పార్టీ సత్తా ఏమిటో చూపిద్దామని వై.ప్రదీప్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.92లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శ్రావణమాసం నాలుగు రోజులకు భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. హుండీ లెక్కింపు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో స్వామి వారికి నగదు రూపంలో రూ.92,09,323 వచ్చిందన్నారు. అలాగే వెండి 23కిజిల 100గ్రాములు, బంగారం 19గ్రాముల 500మిల్లిగ్రాములు, కొంత విదేశీ కరెన్సీ వచ్చినట్లు వెల్లడించారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ సిబ్బందితో పాటు ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉపప్రధాన అర్చకుడు మహదేవస్వామి, ముఖ్యఅర్చకుడు నాగరాజ్‌స్వామి, ఆదోని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, ఆలయ పర్యవేక్షకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై మూడు నెలల శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 7వ తరగతి చదివిన నిరుద్యోగులకు చేపల పెంపకంపై మూడు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథబాబు తెలిపారు. స్థానిక బంగారుపేటలోని దేశీయ మత్స్య శిక్షణా కేంద్రంలో సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు 144వ జట్టుకు శిక్షణ ఇస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ నెల 29లోగా దరఖాస్తులను బంగారుపేటలోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు మత్స్య శాఖ ఉప సంచాలకులు, బంగారుపేట, రైల్వేస్టేషన్ రోడ్డులోని కార్యాలయలలో సంప్రదించాలన్నారు.

జనసంద్రం: డోన్ పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కి వైఎస్ జగన్‌ను చూస్తున్న ప్రజలు





ఆత్మీయ అభివాదం
ప్రజలకు నమస్కరిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

హోరెత్తిన అభిమానం!

జననేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసిన వెంటనే పెల్లుబుకిన ఆనందం.. కరచాలనం చేసేందుకు ఉరికిన ఉత్సాహం... 'సీఎం.. సీఎం..జై జగన్' అంటూ నింగిని అంటేలా నినాదం.. ఎటు చూసినా జనమే జనం.. ఉత్తేజం.. ఉల్లాసం.. బుధవారం డోన్ పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి పర్యటన ఆద్యంతం అభిమాన సంద్రంగా సాగింది. ప్రతి చోటా జననేతపై ప్రజలంతా పూలు చల్లుతూ అభిమానం చాటుకున్నారు. 'అమ్మఒడి పథకంతో మమ్మల్ని ఆదుకున్నారు ' అంటూ మహిళలు చేతులెత్తి నమస్కరించారు. 'మేమంతా సిద్ధం' అనే జెండాలతో యువత కదం తొక్కారు. 'వ్యవసాయాన్ని పండుగ చేశారు' అంటూ కర్షకులు కదలి వచ్చారు. అడుగడుగునా ప్రజలు అభిమానాన్ని హోరెత్తించారు.

బుగ్గన రాజేంద్రనాథరెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన మాజీ సీఎం వైఎస్‌జగన్

- నూతన దంపతులు అర్జున్, అనన్యకు శుభాకాంక్షలు
- భారీగా తరలివచ్చిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు
- జగన్‌ను చూడగానే ఈలలు, కేకలతో హోరెత్తిన రిసెప్షన్ వేదిక



హర్షధ్వానం: జననేతను చూసిన ఆనందంలో కేరింతలు కొడుతున్న యువకులు



మేమంతా సిద్ధం: జెండాలను ప్రదర్శిస్తున్న యువకులు

డోన్: ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి కుమారుడు బుగ్గన అర్జున్ వివాహ రిసెప్షన్ వేడుక బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులు బుగ్గన అర్జున్ అమర్నాథరెడ్డి, అనన్యలకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. డోన్ శివారులోని దత్తాత్రేయ స్వామి ఆలయ సమీపంలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేశారు. నూతన దంపతులకు వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఉదయం 11.30 గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి నేరుగా డోన్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు జగన్‌కు స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద భారీగా జనం జగన్ కోసం వేచి ఉన్నారు. హెలికాప్టర్ రాగానే 'జై జగన్' నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. అక్కడి నుంచి వివాహవేదిక వద్దకు జగన్ చేరుకున్నారు. జగన్‌ను చూడగానే అభిమానుల ఈలలు, కేకలు, 'జై జగన్, సీఎం...సీఎం' నినాదాలతో వేదిక ప్రాంగణం హోరెత్తింది. జగన్‌కు బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై జగన్ వస్తున్నంత సేపు జనాభిమానంతో ప్రాంగణం హోరెత్తింది. అందరికీ జగన్ ఆప్యాయంగా అభివాదం చేస్తూ, నమస్కరిస్తూ కదిలాడు. చిరునవ్వులు చిందిస్తూ, కరచాలనం చేస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు. నూతన దంపతులను ఆశీర్వదించి, నూతన దంపతుల తల్లిదండ్రులైన బుగ్గన దంపతులు, చల్లా సతీశ్‌రెడ్డి దంపతులు, సమీప బంధువులతో ఆప్యాయంగా మాట్లాడారు.



అద్భుత ఘట్టం: వైఎస్ జగన్‌తో కరచాలనం చేస్తూ..



తీపిజ్ఞాపకం: సెల్‌ఫోన్లతో జననేత ఫొటోలు తీసుకుంటూ..



వైఎస్ జగన్‌ను చూడటానికి వచ్చిన రైతులు



అక్కచెల్లెమ్మల ఆనందోత్సాహాలు



నమస్కరిస్తున్న మహిళలు

ఫొటోలు దిగారు. అపై వేదికపై నుంచి అందరికీ అభివాదం చేసి నేరుగా హెలిప్యాడ్‌కు చేరుకుని తిరుగుపయనమయ్యారు. జగన్ రాకతో డోన్ మొత్తం జనాలతో కిక్కిరిసిపోయింది. వేదిక ఏర్పాటు చేసిన ఎన్‌హెచ్–44 సమీపంలో రోడ్డుకు ఇరువైపులా భారీగా జనం ఉన్నారు. జగన్ కాన్వాయ్ వెళ్తుంటే జైజగన్ అంటూ హోరెత్తించారు. కారులో నుంచి జగన్ అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేశారు. వేడుకకు ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరూపాక్షి, ఎమ్మెల్సీలు ఇసాక్ బాషా, మధుసూదన్, కల్పలతారెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, కంగాటి శ్రీదేవి, మాజీ ఎంపీలు బుట్టా రేణుక, పోచా బ్రహ్మానందరెడ్డి, తలారి రంగయ్య, పార్టీ నేతలు ఆదిమూలపు సతీష్, దారా సుధీర్, కోట్ల హర్షతో పాటు నంద్యాల, కర్నూలుతో పాటు పలు జిల్లాల నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

ప్రత్యేక ఆకర్షణగా బుగ్గన ఇంటి సెట్

రిసెప్షన్ కోసం వేదికపై ప్రత్యేకంగా సెట్ ఏర్పాటు చేశారు. బుగ్గన సొంతూరు బేతంచెర్లలో వారి పూర్వీకులు 1923లో ఇంటిని నిర్మించారు. ఇప్పటికీ అదే ఇంట్లో బుగ్గన నివాసం ఉంటున్నారు. వేదికపై తన ఇంటి నమూనాతో సెట్ వేయించారు. అచ్చం బుగ్గన నివాసం ఎలా ఉందో అలాగే సెట్ ఉండటంతో వేడుకకు హాజరైన వారు ప్రత్యేకంగా తిలకించారు. ఇంటి ముందే రిసెప్షన్ జరిగిన భావన కల్పించారు.

దారి పొడవునా ఘనస్వాగతం

బేతంచెర్ల: హెలిప్యాడ్ స్థలం నుంచి బయలుదేరిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జనం దారి పొడవునా ఘన స్వాగతం పలికారు. డోన్ పట్టణానికి చెందిన ఓ యువతి మాజీ సీఎం జగన్‌కు రాఖీ కట్టారు. బేతంచెర్ల పట్టణానికి చెందిన యువకులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని పట్టుకొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.



పూల వర్షం కురిపిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు



జననేతను చూసేందుకు ఉరుకులు, పరుగులు




హెలిప్యాడ్ వద్ద భారీ జన సందోహం

చేయూత కరువై.. చేనేత చిక్కుముడై!

ఒక్క హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం

- హామీలు మాటలకే పరిమితం
- జీఓలు విడుదల చేస్తున్నా అమలు కరువు
- ఉమ్మడి జిల్లాలో రాణించిన 4,148 చేనేత కుటుంబాలు
- కూటమి ప్రభుత్వంలో 2,842 కుటుంబాలకే పరిమితం
- గత ప్రభుత్వంలో ఆదుకున్న వైఎస్సార్ నేతన్న నేస్తం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం



పాత పథకానికి కొత్త 'షో'కు

చేనేతలకు పొదుపు నిధి ఎప్పటి నుంచో అమలులో ఉంది. చేనేత సహకార సంఘాల్లో పనిచేసే కార్మికులకు చెల్లించే వేజ్‌లో పొదుపు కింద 8 శాతం కట్ చేస్తే, దానికి 16 శాతం ప్రభుత్వం కలుపుతుంది. దీనినే పొదుపు నిధిగా వ్యవహరిస్తారు. అయితే కూటమి ప్రభుత్వం తామే ఈ కార్యక్రమాన్ని తీసుకొస్తున్నట్లు ప్రకటించుకోవడం విమర్శలకు తావిస్తోంది.

కర్నూలు(అగ్రికల్చర్) : ఒకప్పుడు వ్యవసాయ రంగం తర్వాత చేనేత పరిశ్రమ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. 2023–24 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 4,148 చేనేత కుటుంబాలు ఉండగా.. అప్పటి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద నెలకు రూ.2వేల ప్రకారం ఏడాదికి రూ.24 వేల ఆర్థిక తోడ్పాటును అందించింది. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి చేయూత లేకపోవడంతో ఈ స్వల్ప కాలంలోనే 1,306 కుటుంబాలు చేనేత వృత్తికి స్వస్తి పలకడం గమనార్హం. నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఉమ్మడి జిల్లాలో కేవలం 2,842 కుటుంబాలకు మాత్రమే వర్తిస్తోంది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చేనేత పరిశ్రమ మనుగడ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

చేయూత కోసం ఎదురు చూపులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు గడుస్తున్నా చేనేత కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యలు ఒక్కటంటే ఒక్కటీ లేదు. చేనేత పరిశ్రమను అభివృద్ధి చేసుకునేందుకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని, చేనేతకార్మికుల ఆరోగ్య భద్రతకు బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించినా అమలుకు నోచుకోలేదు. చేనేతలకు భారంగా మారిన జీఎస్టీని ఎత్తి వేస్తామని, ఇది సాధ్యం కాకపోతే కట్టిన జీఎస్టీని వెనక్కు ఇస్తామన్నా ఉలుకూపలుకూ లేదు. చేనేత కార్మికులు ఇళ్లు నిర్మించుకుంటే మగ్గం ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా మామూలుగా ఇచ్చే రూ.4.30 లక్షలకు అదనంగా రూ.50 వేలు చెల్లిస్తామన్న హామీ మాటలకే పరిమితమైంది. కార్మికుల ఆదాయాన్ని పెంచేలా సమగ్ర పాలసీని తెస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చని పరిస్థితి.



ఎమ్మిగనూరులో మగ్గంపై చీర నేస్తున్న మహిళ

నేడు జాతీయ చేనేత దినోత్సవం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రెండవ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఈ నెల 7న నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లాకు సంబంధించి ఎమ్మిగనూరులోని కుర్ని ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాకు సంబంధించి బనగానపల్లి మండలం నందివర్గంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.

జీఓలు ఇవ్వడమే తప్ప కార్యాచరణ కరువు

- 2014–15 నుంచి 2018–19 వరకు చేనేత కారుల సంక్షేమం మాటల్లో ఊదరగొట్టడం.. జీఓలు విడుదల చేయడం మినహా ఒక్కటీ కార్యరూపం దాల్చని పరిస్థితి.
- చేనేతల సంక్షేమానికి విడుదల చేసిన జీఓల విలువ దాదాపు రూ.200 కోట్లు. అయితే కాగితాలకే పరిమితమైంది.
- 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రతి ఏటా చేనేతకారులకు వేజ్‌లాస్ కింద నెలకు రూ.2వేల ప్రకారం మూడు నెలల పాటు పరిహారం ఇచ్చేందుకు జీఓలతో సరి పెట్టారు.
- ఒకప్పుడు జిల్లాలో రూ.200 కోట్ల వరకున్న చేనేత వస్త్రాల ఉత్పత్తి టీడీపీ హయాంలో రూ.40 కోట్లకు పడిపోయింది.
- ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో 45 చేనేత సహకార సంఘాలు ఉండగా.. నేడు ఏడుకు పడిపోవడం గమనార్హం.

కూటమి ప్రభుత్వంలో అరకొర బడ్జెట్

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత శాసనసభలో రెండు సార్లు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. అయితే రెండేళ్లలో చేనేతలకు కేటాయించిన బడ్జెట్ రూ.10 కోట్లు మాత్రమే. నామమాత్రపు బడ్జెట్‌తో చేనేతల సంక్షేమం ఎలా సాధ్యమనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం నేతన్న సంక్షేమానికి ఏటా రూ.200 కోట్లు కేటాయించింది. ఐదేళ్లలో రూ.1000 కోట్లు వెచ్చించిన విషయాన్ని చేనేతలు గుర్తు చేసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో చేనేతలకు రూ.47.58 కోట్ల ఆర్థిక తోడ్పాటు

ఐదేళ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పింది చెప్పినట్లుగా అమలు చేసి చూపించారు. రెండేళ్లు కరోనాతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైనప్పటికీ ఎక్కడా రాజీపడకపోవడం విశేషం. చేనేత మగ్గాలను అభివృద్ధి చేసుకోవడం, ఇతర మౌలిక సదుపాయాలతో సమర్థవంతంగా రాణించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతినెలా రూ.2వేలు చొప్పున ఏడాదికి రూ.24వేలు చెల్లించింది. ఒక్కో చేనేత కుటుంబానికి ఐదేళ్లలో రూ.1.20 లక్షల ఆర్థిక లబ్ధి చేకూరింది. ఐదేళ్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేతలకు రూ. 47.58 కోట్ల ఆర్థిక తోడ్పాటు లభించింది.

చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ.36 వేలు చెల్లించాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేసింది. నెలకు రూ.2వేల ప్రకారం ఏడాదికి రూ.24 వేలు చేయూతనిచ్చింది. చంద్రబాబు ప్రభుత్వం చేనేతల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏడాదికి రూ.36 వేల ప్రకారం తోడ్పాటును అందించాలి. అద్దె మగ్గాలకు కూడా ఈ సాయాన్ని వర్తింపజేయాలి. 40 శాతం సబ్సిడీపై యార్న్ సరఫరా చేయాలి. – బి.మాధవస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు, చేనేత కార్మిక సంఘం

క్లుప్తంగా

కొనసాగుతున్న విజిలెన్స్ దర్యాప్తు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయంలో బుధవారం విజిలెన్స్ అధికారులు రికార్డుల పరిశీలన కొనసాగించారు. విజిలెన్స్ డీఎఫ్ఓ శివప్రసాద్ నేతృత్వంలో పరిశీలన జరిగింది. కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన చాంద్‌బాషా నాలుగు కోట్ల రూపాయల అటవీశాఖ నిధులు వేరే బ్యాంకు ఖాతాలకు మళ్లించారన్న విషయంపై ఇప్పటికే కేసు నమోదై నలుగురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కాగా చాంద్‌బాషా ఉద్యోగం నిర్వహించిన కాలంలో జరిగిన లావాదేవిలన్నీ పరిశీలించాలన్న ఉన్నతాధికారుల నిర్ణయంతో ఈ పరిశీలన సాగుతోంది. చాంద్‌బాషా అవినీతి వ్యవహారంలో ఇతరుల ప్రమేయాన్ని కూడా గుర్తించడం తమ తనిఖీ ఉద్దేశమని విజిలెన్స్ డీఎఫ్ఓ శివప్రసాద్ తెలిపారు. అటవీశాఖ కేంద్ర కార్యాలయం నుంచి అటవీ దళాల ప్రధానాధికారి ఈ పరిశీలనను స్వయంగా సమన్వయం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పరిశీలనలో ఎన్ఎస్‌టీఆర్ సర్కిల్ కార్యాలయ అకౌంటెంట్ పద్మావతి, కర్నూలు,నంద్యాల అడ్మినిస్ట్రేట్ అధికారులు చంద్రశేఖరరాజు, రవికుమార్, విజిలెన్స్ రేంజ్ అధికారి శంకరయ్య ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

కోడుమూరు రూరల్: ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం కోడుమూరుకు చెందిన ఓ మైనర్ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే కాలనీకి చెందిన 30ఏళ్ల వ్యక్తి మద్యం మత్తులో ఆ ఇంట్లోకి ప్రవేశించి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. జరిగిన విషయాన్ని బాలిక కోడుమూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఎస్ఐ ఎర్రిస్వామి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడంతో పాటు, నిందితుడిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించండి



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ (ప్రాజెక్ట్స్) డైరెక్టర్ అయూబ్‌ఖాన్

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ (ప్రాజెక్ట్స్) డైరెక్టర్ అయూబ్‌ఖాన్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కొత్తబస్టాండు సమీపంలోని విద్యుత్ భవన్‌లో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో పీఎం సూర్యఘర్ పథకం ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ పథకం సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చక్కటి అవకాశం కల్పిస్తోందని, దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇంటిపైనే సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడానికి కేంద్రం ఆకర్షణీయమైన రాయితీలు ఇస్తోందని, బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని సోలార్ వెండర్లకు సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఈ నెల చివరి నాటికి 100 యూనిట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 20 యూనిట్లు నెలకొల్పేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. 200 యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్న వారందరూ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేపట్టేలా చూడాలన్నారు. అలాగే లో వోల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ఈఈ ఓబులేసు, జిల్లా నోడల్ అధికారి కృష్ణారెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చిన్న రాఘవులు, కర్నూలు అర్బన్ ఈఈ శేషాద్రి, ఈఈ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భువనమోహన.. పరమపావన



రాఘవేంద్రుల మూల బృందావనం

- రేపటి నుంచి సద్గురు 354వ ఆరాధన మహోత్సవాలు
- 14వ తేదీ వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



బంగారు కాంతుల్లో శ్రీమఠం కారిడార్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పుష్కరిణి

మంత్రాలయం: వేదభూమి ప్రదాత.. భువనమోహనుడు సద్గురు రాఘవేంద్రస్వామి. మధ్వమత సార్వభౌముడిగా జగద్విఖ్యాతి గడించి భక్తకోటి వేల్పువుగా వర్ధిల్లుతున్నారు. సద్గురు సశరీరంగా చింతామణి సదృశ్యులైన శ్రీరాఘవేంద్రుల 354వ ఆరాధన సప్త రాత్రోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో ఏడు రోజుల పాటు వేడుకలు వైభవంగా జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి దాదాపు 2 లక్షల భక్తులు తరలివచ్చి వేడుకల్లో తరించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే వేదభూమి విద్యుద్దీప కాంతులతో కాంతులీనుతోంది. రోజూ రాయరు రథోత్సవాలతోపాటు రాములోరి సంస్థాన పూజలు ఉంటాయి. భక్తుల కోసం యోగీంద్ర మండపంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉత్సవ విశేషాలు

- శుక్రవారం ఉత్సవాల ప్రారంభోత్సవంలో భాగంగా ధ్వజారోహణ, ధాన్యపూజ, గోవు, తురగ పూజ, ప్రార్థనోత్సవం కానిస్తారు. ఉదయం తిరుమల తిరుపతి దేవస్థానం, కాంచీపురం వరదరాజుల క్షేత్రం, శ్రీరంగపట్నం రంగనాథ స్వామి ఆలయాల నుంచి పట్టువస్త్రాల సమర్పణ ఉంటుంది.
- శనివారం శాఖోత్సవం, రజత మంటపోత్సవం చేపడతారు.
- ఆదివారం పూర్వారాధన సందర్భంగా సింహవాహనంపై ప్రహ్లాదరాయల ఊరేగింపు ఉంటుంది. సాయంత్రం యోగీంద్ర మంటపంలో ప్రముఖులకు అనుగ్రహ ప్రశస్తి అవార్డు ప్రదానం గావిస్తారు. అలాగే తొలిసారిగా క్షేత్రంలో స్వామి తెప్పోత్సవం నిర్వహించనున్నారు.



పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

- సోమవారం మధ్యారాధన పురస్కరించుకుని రాఘవేంద్రుల మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేస్తారు. బంగారు పాదుక పట్టాభిషేకంతోపాటు మధ్యాహ్నం పాదుకలు, ప్రతిమలు బంగారు రథంపై ఊరేగింపు కానిస్తారు. రాత్రి గజవాహనోత్సవంతోపాటు రజత, సువర్ణ రథోత్సవాలు ఉంటాయి.
- మంగళవారం ఉత్తరారాధన సందర్భంగా క్షేత్రంలో రాఘవేంద్రుల మహా రథోత్సవం అంగరంగ వైభవంగా చేపడతారు. హెలికాప్టర్‌తో పుష్పవృష్టి ఉంటుంది. అలాగే రాఘవేంద్రుల మూల బృందావనానికి తొలిసారి వజ్రరత్న కవచ ధారణ కానించనున్నారు.
- బుధవారం పూర్వపు పీఠాధిపతి సుజ్ఞానేంద్రుల ఆరాధన, అశ్వవాహన సేవలు కానిస్తారు.
- గురువారం సర్వ సమర్పణోత్సవంలో భాగంగా బంగారు పల్లకీ, చెక్క, వెండి, బంగారు రథోత్సవాలు ఉంటాయి.

భక్తులకు ఏర్పాట్లు

ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం 5 లక్షల పరిమళ ప్రసాదాలు తయారు చేశారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు అన్నపూర్ణ భోజనశాల, నదీతీరం, సీఆర్వో కార్యాలయం, 200 గదుల సముదాయంతో శౌచాలయాలు ఏర్పాటు చేశారు. తుంగభద్ర నదిలో వరద నీరు ఉధృతంగా పారుతుండటంతో పుణ్య స్నానాలకు ప్రత్యేక షవర్లు ఉన్నాయి. మఠం సీఆర్ఓ, ప్రధాన ముఖద్వారం, మఠం ప్రాకారం, అన్నపూర్ణ భోజనశాల దారిలో వాటర్ ప్లాంట్లు నెలకొల్పారు. ఉత్సవాలను మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, మేనేజర్–3 శ్రీపతిఆచార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్ కోనాపూర్ భక్తులు ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు.

పోలీసు శాఖలో భారీగా బదిలీలు

- ఉమ్మడి జిల్లాలో 14 మంది బదిలీ

కర్నూలు: పోలీసు శాఖలో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. నాల్గవ జోన్ పరిధిలోని (ఫోర్త్ జోన్) కర్నూలు, అనంతపురం రేంజిలో పనిచేస్తున్న 36 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ రాయలసీమ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న పది మంది సీఐలకు ఈ బదిలీల్లో పోస్టింగులు దక్కాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న 14 మంది సీఐలకు స్థానచలనం కలిగింది. ఇందులో భాగంగా వీఆర్‌లో ఉన్న ఇద్దరు స్టేషన్లకు నియమితులు కాగా, స్టేషన్‌లో ఉన్న ముగ్గురిని వీఆర్‌కు బదిలీ చేశారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో బదిలీ అయిన సీఐలు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎ.గంగాధర్	వీఆర్, కర్నూలు	ఆస్పరి యూపీఎస్
మస్తాన్ వలి	ఆస్పరి యూపీఎస్	వీఆర్, కర్నూలు
హేమంత్ కుమార్ రెడ్డి	వీఆర్, కర్నూలు	వన్‌టౌన్, కర్నూలు
ఎం.నాగశేఖర్	కర్నూలు వన్‌టౌన్	సీసీఎస్1, కర్నూలు
రామయ్య నాయుడు	వన్‌టౌన్, కర్నూలు	డీటీసీ, కర్నూలు
ఎం.పార్థసారథి	డీటీసీ, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్
కె.శ్రీనివాస నాయక్	సీసీఎస్ 1, కర్నూలు	ఆదోని ట్రాఫిక్ యూపీఎస్
గంటా సుబ్బారావు	ఆదోని ట్రాఫిక్	కడప వీఆర్
జె.రమేష్ కుమార్	నంద్యాల వీఆర్	సీసీఎస్ 2, కర్నూలు
ఎస్.అస్రార్ బాషా	సీసీఎస్ 2, కర్నూలు	నంద్యాల టూటౌన్
ఎస్.కె.ఇస్మాయిల్	నంద్యాల టూటౌన్	సీసీఎస్ 2, నంద్యాల
పూల రామకృష్ణ	సీసీఎస్ 2, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
ఎన్.కృష్ణయ్య	డీసీఆర్‌బీ, నంద్యాల	వీఆర్, కడప
జీవన్ గంగనాథ్ బాబు	బి.కొత్తకోట యూపీఎస్	వీఆర్, నంద్యాల

అటవీ సిబ్బంది, గిరిజనుల మధ్య వాగ్వాదం

- పొలాలకు ఉన్న కంచె తొలగించేందుకు ప్రయత్నించడంతో తోపులాట

కొత్తపల్లి: పొలాలకు ఉన్న కంచెను తొలగించే క్రమంలో అటవీశాఖ సిబ్బందికి, గిరిజనులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని గువ్వలకుంట్ల మజారా గ్రామమైన పాతచదరంపెంట నల్లమల అటవీ ప్రాంతంలో సుమారు 50 ఇళ్లదాకా గిరిజనులు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగించేవారు. పదేళ్ల క్రితం అటవీ శాఖ అధికారులు వారికి పాలెంచెరువు సమీపంలో ఐటీడీఏ శాఖతో కలిసి ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అయితే పాత చదరంపెంటలో ఆ గిరిజనులు సుమారు 150 ఎకరాల పొలాన్ని సాగుచేసేవారు. అటవీ శాఖ అధికారులు ఇంటి స్థలాలు ఇచ్చారుగానీ పొలాలు ఇవ్వలేదని గిరిజనులు వాపోతున్నారు. ఈ పొలాలకు అడవి జంతువుల నుంచి రక్షణ కోసం ఐటీడీఏ సహకారంతో చుట్టూ కంచె వేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం కంచె ఉండడం వల్ల అడవి జంతువులకు ఇబ్బంది కలుగుతుందని ఫారెస్ట్ అధికారులు కంచె తొలగించేందుకు ప్రయత్నించారు. దీంతో గిరిజనులకు, అటవీశాఖ సిబ్బందికి మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. తమ పొలాలకు కంచె వేసుకుంటే ఫారెస్ట్ అధికారులు తొలగించేందుకు ప్రయత్నించడం దుర్మార్గం అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ వారేమో కంచె వేసుకోమంటున్నారు, ఫారెస్ట్ అధికారులు మాత్రం తొలగించాలంటున్నారని వాపోయారు. దీంతో ఫారెస్టు అధికారులు వెనక్కి వెళ్లిపోయారు.



అటవీశాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన గిరిజనులు

'చెత్త' నగరంగా కర్నూలు



మునిసిపల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో పారిశుద్ధ్యం లోపించి చెత్త నగరంగా తయారైంది. ఇందుకు మునిసిపల్ అధికారులే కారణమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలుతోపాటు ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు పట్టణాల్లోనూ ఇంటింటి చెత్తసేకరణ, పారిశుద్ధ్య పనులను సజావుగా సాగేలా చూడాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మునిసిపాలిటీల పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 1,200 మంది శానిటరీ వర్కర్లు ఉన్నప్పటికీ నగరాన్ని శుభ్రంగా ఉంచలేకపోతే ఎలాగని ప్రశ్నించారు. బీక్యాంపు నుంచి రాజ్‌విహార్ వరకు రోడ్లు శుభ్రంగా లేవని.. పలుమార్లు చెప్పినా మార్పు లేదన్నారు. ఆయా శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్‌ను ఆదేశించారు. ప్రజారోగ్య అధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలన్నారు. రేపటి నుంచి పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగాలని, తానే స్వయంగా తనిఖీ చేస్తానన్నారు.

కలెక్టర్ ఏమన్నారంటే..

- కల్లూరు పరిధిలోని 16 వార్డులకు ప్రతిరోజూ నీరు ఇచ్చేందుకు కమిటీలు వేశాం. ఆ కమిటీ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటాం.
- నగర సుందరీకరణలో భాగంగా బీక్యాంపు నుంచి బస్టాండ్ వరకున్న డీవైడర్లకు ఆకర్షణీయంగా పెయింటింగ్ చేయించాలని కమిషనర్‌ను ఆదేశించారు.
- ఎన్క్యాప్ ఫండ్ రూ.7 కోట్లతో పనులు చేపట్టాలని 8 నెలల కిందట ఆదేశాలు ఇచ్చాం, పనులు నత్తనడక సాగుతుండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి పత్రికల్లో ప్రతి రోజూ ప్రతికూల వార్తలు వస్తున్నాయని, వాటిపై విచారణ జరిపి తగు నివేదికలు ఇవ్వాలని సిటీ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు.
- ఆదోని బసాపురం ట్యాంకుకు సంబంధించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఆదోని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు కమిషనర్లు కృష్ణ, గంగిరెడ్డి, రమేష్‌బాబు, కర్నూలు నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'ఉత్తమ' దరఖాస్తులకు రేపు తుది గడువు

- మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ

నంద్యాల(న్యూటౌన్): ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించేందుకు శుక్రవారం వరకు అవకాశం ఉంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, డైట్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. మూడు కేటగిరీల్లో అవార్డులు అందజేయనున్నారు. జిల్లా నుంచి 16 మందిని ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులకు కనీసం పదేళ్ల సర్వీసు పూర్తయి ఉండాలి. అలాగే ఏ విధమైన క్రమశిక్షణా చర్యలు, క్రిమినల్ కేసులు లేనివారు మాత్రమే అర్హులు.

వివిధ స్థాయిల్లో కమిటీలు..

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మండల స్థాయిలో ఎంఈఓ చైర్మన్‌గా, సభ్యులుగా స్థానిక హెచ్ఎం, డైట్ లెక్చరర్/మండలానికి చెందని మరో హెచ్ఎం సభ్యులుగా ఉంటారు. మండలంలో ఒకరిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. డివిజనల్ స్థాయిలో డీవైఈఓ చైర్మన్‌గా, మరో ముగ్గురు ముగ్గురు సభ్యులతో సభ్యులతో కూడిన కమిటీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్, ఎమినెంట్ ఎడ్యుకేషనలిస్ట్, మరో జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తుంది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు కూడా జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు.

షెడ్యూల్ ఇలా..

- ఈ నెల 8వ తేదీ వరకు డివిజనల్ స్థాయిలో దరఖాస్తులు స్వీకరిస్తారు.
- 11న వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేస్తారు. 12న డివిజనల్ స్థాయిలో స్క్రూటినీ చేసిన జాబితాను డీఈఓ కార్యాలయంలో అందజేస్తారు.
- 14న డివిజనల్ స్థాయి నుంచి వచ్చిన అన్ని కేటగిరీల దరఖాస్తులను స్క్రూటినీ చేసి 1:1 నిష్పత్తిలో ఎంపిక చేస్తారు.
- 16న తుది జాబితాను జిల్లా విద్యాశాఖ నుంచి పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తారు.
- 21 నుంచి 23 వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- 25న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వారి తుది జాబితాను రూపొందిస్తారు.
- సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేస్తారు.

ట్రాలీ ఆటో బోల్తా : 20 మందికి గాయాలు



గాయపడిన ఎంపీటీసీ సభ్యుడు రుద్రవరం నాగేశ్వరరావును ఆసుపత్రికి తరలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి





తీవ్రంగా గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

వెల్దుర్తి: హైవే–44పై వెల్దుర్తి పట్టణ సమీపంలో ఈద్గా వద్ద ట్రాలీ ఆటో టైర్ పేలడంతో అందులో ప్రయాణిస్తున్న 20 మంది గాయపడ్డారు. వారంతా బుధవారం డోన్ పట్టణానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. బేతంచెర్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన 20 మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు ట్రాలీ ఆటోలో డోన్‌కు వెళ్లి వెల్దుర్తి మీదుగా తిరిగివస్తున్నారు. హైవేపై వెల్దుర్తి సమీపంలోకి రాగానే టైరు పేలి ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న యంబాయి ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావుతో పాటు బాలరాజు, చంద్రశేఖర్, వరుణ్, గోవిందులకు తీవ్రగాయాలు కాగా బాలమద్దయ్య, లక్ష్మీదేవి, దిలీప్, మహేశ్, మద్దిలేటి స్వామి, శ్రీనివాసులు, పుల్లయ్య, స్వాములు, మద్దిలేటి, రాజు, మద్దయ్య, గోపాల్, ప్రతాప్, శ్రీనుకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. బాలరాజు, చంద్రశేఖర్, వరుణ్, గోవిందును మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

మానవత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఘటనా స్థలంలో క్షతగాత్రులు పడి ఉండగా ఆ మార్గంలో వచ్చిన పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వారిని గమనించి వాహనాన్ని ఆపారు. ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. అంబులెన్స్‌కు సమాచారమిస్తూ, క్షతగాత్రులను పరామర్శిస్తూ ధైర్యం చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, తీవ్ర గాయాల పాలైన మరికొందరిని ముందుగా మరో వాహనంలో వెల్దుర్తి ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ మరికొందరిని హైవే అంబులెన్స్‌లో తరలించారు. హైవే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంలో సహకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఆదోనిలో రెండిళ్లలో చోరీ

- తులం బంగారం, 4.5 కేజీల వెండి, రూ.8 వేలు నగదు అపహరణ



బీరువా పగులగొట్టి దుస్తులను చెల్లాచెదురుగా పడేసిన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణ శివారు కాలనీలో బుధవారం తెల్లవారుజామున రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. స్థానిక రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన పార్వతమ్మ అనే మహిళ మంగళవారం వర్షం కురవడంతో ఇంటికి తాళం వేసి చెల్లెలి ఇంటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఆ ఇంట్లోకి దూరి బీరువా తాళాలను పగలగొట్టి అర తులం బంగారం, రూ.6 వేలు నగదును దొంగలించారు. అందులో కుమారుడికి పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చినందుకు బహుమతిగా ఇచ్చిన బంగారు పతకం కూడా ఉంది. అదే కాలనీకి చెందిన రంగమ్మ అనే మహిళ ఆదివారం ఇంటికి తాళం వేసి తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలంకు వెళ్లింది. బుధవారం ఉదయం ఆ ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దుండగులు ఇంట్లోని బీరువా తాళాలు పగలగొట్టి అర తులం బంగారు కమ్మలు, నాలుగున్నర కేజీల వెండి, రూ.2 వేలు నగదు దోచుకెళ్లినట్లు తెలిసింది. స్థానికులు బుధవారం ఉదయం రెండిళ్ల తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి వెంటనే యజమానులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి విచారణ జరుపుతామని వెల్లడించారు.

బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

- అధిక వడ్డీలకు అప్పులు
- తీర్చలేక అఘాయిత్యం



రవికుమార్ (ఫైల్)

అనంతపురం: అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో అటెండర్ రవికుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. అధిక వడ్డీలకు అప్పులు చేసి వాటిని తీర్చే మార్గం కానరాక బ్యాంకు బాత్‌రూంలో ఉరేసుకుని తనువు చాలించాడు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు నగరంలోని సీ క్యాంప్‌కు చెందిన సంకుల రవికుమార్ (40) గత 12 ఏళ్లుగా అనంతపురంలో ఉంటూ సెంట్రల్ బ్యాంకులో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లాడు. 9.45 గంటలకు భార్య హరితకు ఫోన్ చేసి మనసు బాగోలేదని చెప్పాడు. 10.20 గంటలకు బ్యాంకు ఉద్యోగి పద్మజ అటెండర్ భార్యకు ఫోన్ చేసి రవికుమార్ బాత్‌రూంలోకి వెళ్లి లాక్ చేసుకున్నాడని పిలిస్తే పలకడం లేదని వెంటనే బ్యాంకుకు రావాలని చెప్పారు. 20 నిమిషాల్లో ఆమె అక్కడికి చేరుకుంది. కార్పెంటర్ సాయంతో బాత్‌రూం తలుపు పగులగొట్టి చూడగా అప్పటికే బాత్‌రూం కిటికీ ఇనుప కడ్డీకి నైలాన్ తాడుతో ఉరివేసుకుని రవికుమార్ విగత జీవిగా పడి ఉన్నాడు. అప్పులు అధికం కావడంతో మానసిక ఒత్తిడికి గురై అఘాయిత్యానికి పాల్పడినట్లు మృతుడి భార్య హరిత స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడికి కుమారుడు సూర్యతేజ, కుమార్తెలు దీక్షిత, వీక్షిత ఉన్నారు.

హరిత క్షమించు..

రవికుమార్ ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాశాడు. అందులో ఏముందంటే.. 'హరిత నన్ను క్షమించు. నేను బతికి మీకు ఎలాంటి ఉపయోగం లేదు. పిల్లల్ని, నిన్ను వదిలి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. నేను చేసిన అప్పులే నా పాలిట శాపంగా మారాయి. నేను ఎలాంటి జూదాలూ ఆడలేదు. అధిక వడ్డీలు కట్టలేక.. వడ్డీలు కట్టేందుకు మళ్లీ చేసిన అప్పులు ఒకదానికి ఒకటి తోడయ్యాయి. అమ్మా.. నువ్వు జాగ్రత్త.. పిల్లలు జాగ్రత్త. నా టైం ఇక్కడితో అయిపోయింది. గుజ్జల రాముడు అనే వ్యక్తి వద్ద రూ.50 వేలు అప్పు చేస్తే రూ.15 వేలు పట్టుకుని రూ.35 వేలు ఇచ్చాడు. ప్రతి నెలా రూ.15,000 వడ్డీ కడుతూనే ఉన్నాను. ఇప్పటివరకు రూ.1,20,000 కట్టాను. ఇక నా వల్ల కాదు. హరిత పిల్లలు జాగ్రత్త అని రాశాడు.

పెళ్లి బాజా మోగాల్సిన ఇంట్లో విషాదం

- కుమారుడి పెళ్లి పత్రికలు పంచుతూ తండ్రి మృత్యువాత
- ఎక్సెల్‌ను టెంపో వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం




మృతి చెందిన వెంకటరమణ

ఓర్వకల్లు: పెళ్లి బాజా మోగాల్సిన ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. మండలంలోని సోమయాజులపల్లె గ్రామం, బేతంచెర్ల క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమయాజులపల్లె వెంకటరమణ (60) కుమారుడి పెళ్లి ఈ నెల 13, 14 తేదీల్లో జరిపించేందుకు నిశ్చయం జరిగింది. ఈ క్రమంలో పెళ్లి పత్రికలను పంచేందుకు ఉదయం ఎక్సెల్ వాహనంపై సోమయాజులపల్లెకు బయలుదేరాడు. తిరుగు ప్రయాణంలో బేతంచెర్ల క్రాస్‌రోడ్డు వద్ద స్వగ్రామం వైపు మలుపు తిరుగుతుండగా.. తెలంగాణా రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన టెంపో వాహనం నంద్యాల వైపు నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో వెంకటరమణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. టెంపో వాహనం మృతదేహాన్ని కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లి తప్పించుకుపోగా, స్థానికుల సమాచారంతో అప్రమత్తమైన టోల్‌ప్లాజా సిబ్బంది నన్నూరు టోల్‌ప్లాజా వద్ద టెంపోను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ చెప్పారు. మృతునికి ఐదుగురు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం ఉన్నారు.

గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో (బాలురు) స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యు.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి, జూనియర్ బైపీసీ, జూనియర్ ఎంపీసీలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 7వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 11, 12వ తేదీల్లో సున్నిపెంటలోని పాఠశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలన్నారు. రాష్ట్రంలోని నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, వైఎస్‌ఆర్ కడప, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన గిరిజన విద్యార్థులు అర్హులని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఆంజనేయులు (ఫైల్)

పెద్దకడబూరు: జాలవాడి గ్రామానికి చెందిన వలస కూలీ హైదరాబాదులో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వివరాలు..కురువ జంపాపురం ఆంజనేయులు (35) నెల రోజుల క్రితం ఇద్దరు కూతుళ్లు, కుమారుడిని గ్రామంలో తల్లి దగ్గర వదిలి భార్య లక్ష్మితో హైదరాబాద్‌కు వలస వెళ్లాడు.శ్రావణమాసం కావడంతో భార్య లక్ష్మి ఉరుకుంద ఈరన్న స్వామి మొక్కు తీర్చుకునేందుకు సొంతూరుకు వచ్చింది.అక్కడే కూలీ పనులు చేసుకుంటున్న ఆంజనేయులు బుధవారం నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు నీళ్లు పట్టడానికి వెళ్లి బోరు వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అక్కడున్న వారు ఫోన్ ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టకపోవడం వల్లే కూలీలు వలస వెళ్లి మృత్యువాత పడుతున్నారని గ్రామస్తులు వాపోయారు.